క్లుప్తంగా

2,500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

రావికమతం: ఆర్.కొత్తూరులో 2,500 లీటర్ల బెల్లం పులుపును, వాటి సామగ్రిని ధ్వంసం చేసినట్టు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు శనివారం తెలిపారు. గ్రామ శివారు సరుగుడు తోటల్లో పెద్ద ఎత్తున సారా తయారీ చేస్తున్నట్టు సమాచారం అందగా సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. అదేవిధంగా ఐదు లీటర్ల సారాతో ఒకరిని అరెస్ట్ చేసినట్టు రావికమతం ఎస్ఐ ఉమా మహేశ్వరరావు శనివారం తెలిపారు. చినపాచిలలో దొడ్డి గోవింద సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్ ఆత్మహత్య

మాకవరపాలెం: మండలంలోని వెంకన్నపాలెంలో శనివారం షిఫ్ట్ ఆపరేటర్ వడ్లపూడి వెంకట సురేష్(46) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదనపు ఎస్ఐ సన్యాసిరావు వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా తిరుమలపాలెం గ్రామానికి చెందిన అతడు వెంకన్నపాలెంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కశింకోట మండలం కన్నూరుపాలెం వద్ద ఓ కంపెనీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం కంపెనీకి వెళ్లకపోవడంతో తోటి పనివారు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కంపెనీ సెక్యూరిటీ గార్డు వచ్చి ఇంటి కిటికీలో నుంచి చూడగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

1,200 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్ల సేద్యం లక్ష్యం

నాతవరం: జిల్లాలోని 24 మండలాల్లో ఈ ఏడాది 1,200 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్లు రాయితీపై ఏర్పాటు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా సూక్ష్మ నీటి సాగు వినియోగం ప్రాజెక్టు డైరెక్టరు జి.విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె మండల ప్రత్యేకాధికారిగా రాజుపేట అగ్రహారం, నాతవరం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ డ్రిప్ ఏర్పాటుకు ఐదెకరాల లోపు భూమి ఉన్న సన్నకారు రైతుకు 90 శాతం రాయితీ, ఆపై భూమి ఉన్న రైతుకు 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. స్ప్రింకర్లకు ఐదెకరాల లోపు ఉన్న రైతుకు 55 శాతం, అంతకు మించి ఉంటే 45 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఇందుకోసం గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. ఈ పథకానికి విద్యుత్ బోరు లేదా బావి నీటి సదుపాయం ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు.

శతశాతం గాలికుంటు నివారణ టీకాల లక్ష్యం

కె.కోటపాడు: దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో పశువులకు గాలికుంటు టీకాలను శతశాతం వేయాలని పశువైద్యాధికారులు పశు వైద్య సహాయకులకు సూచించారు. స్థానిక ఏ.డి కార్యాలయంలో రెండు మండలాల్లోని ఆర్బీకేల్లో పని చేస్తున్న పశువైద్య సహాయకులకు సమావేశం నిర్వహించారు. పశువైద్యాధికారులు సిహెచ్.వై.నాయుడు, మంజూష, అలేఖ్య, ప్రియాంక పాల్గొన్నారు.

రాయితీపై సాగు యంత్రాలు

దేవరాపల్లి: యాంత్రీకరణ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. తారువ ఆర్బీకేలో ఆమె మాట్లాడుతూ కిసాన్ డ్రోన్‌తో పంటలకు క్రిమిసంహారక మందు, నీటిలో కరిగే ఎరువులను ఎకరాకు పది నిముషాల్లోను, గంట వ్యవధిలో 5 లేదా ఆరెకరాల్లో పిచికారీ చేయవచ్చన్నారు. దీని ఖరీదు రూ.10 లక్షలు, ప్రభుత్వ సబ్సిడీ 40 శాతం (రూ.4 లక్షలు), బ్యాంకు రుణం 50 శాతం (రూ.5 లక్షలు), మిగిలిన 10 శాతం సొమ్ము రైతులు చెల్లించాలన్నారు. వరికోత, నూర్పిడి యంత్రం ఖరీదు రూ.23 నుంచి రూ. 32 లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ సబ్సిడీ రూ. 8.80 లక్షలు, 50 శాతం బ్యాంక్ రుణం అందిస్తుందన్నారు.

మద్యం తరలిస్తున్న సేల్స్‌మన్ అరెస్టు

బుచ్చెయ్యపేట: అక్రమంగా మద్యం తరలిస్తున్న సేల్స్‌మన్‌ను అరెస్టు చేసి 110 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం రాత్రి అదనపు ఎస్ఐ వి.సిహెచ్ నాయుడు తమ సిబ్బందితో వడ్డాదిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, స్కూటర్‌పై మద్యం తరలిస్తున్న పెదమదీనాకు చెందిన కొళ్లిమల్ల మహేష్‌ను పట్టుకున్నారు. అతడు వడ్డాది వైన్ షాపులో సేల్స్‌మన్‌గా పని చేస్తున్నాడు. తన ఇంటి వద్ద మద్యం అమ్మకానికి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వందేళ్ల రోడ్డు సమస్యకు మోక్షం

- ఆరిల్లోవ రోడ్డు విస్తరణకు అటవీ శాఖ అనుమతి
- ఎమ్మెల్యే గణేష్ కృషితో త్వరలో పనులు ప్రారంభం



ఆరిల్లోవ రోడ్డు దుస్థితి(ఫైల్)



అమరావతిలో సమస్యను సీఎంకు వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్ (ఫైల్)



అటవీ శాఖకు నిధులు జమ చేసిన పత్రం

గొలుగొండ: ఎట్టకేలకు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేసిన కృషి ఫలించింది. బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటి వరకు ఆరిల్లోవ రోడ్డు విస్తరణకు నోచుకోక అనేక ఇబ్బందులు, అనునిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో పలుమార్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి అటవీ శాఖ అనుమతులతోపాటు నిధులు మంజూరు చేయించారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుతోపాటు గత పాలకులకు సాధ్యంకాని పనిని చేసి చూపించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వారం రోజుల్లో ఆరిల్లోవ రిజర్వు ఫారెస్టులో రోడ్డు పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నిత్యం ప్రమాదాలు..

నర్సీపట్నం-దేవిపట్నం మార్గంలో గొలుగొండ మండలం ఎర్రవరం దాటిన తర్వాత ఆరిల్లోవ రిజర్వు ఫారెస్టులో రోడ్డును వందేళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో నిర్మించారు. ఈ మార్గంలో 3.5 కిలోమీటర్ల మేర రిజర్వు ఫారెస్టులో ఉండటంతో అప్పటి నుంచి రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. దాంతో పెద్ద గోతులు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు పోలీస్ రికార్డుల్లో 42 మంది వరకు మరణించారు. వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మారారు. ఈ రోడ్డు అల్లూరి, అనకాపల్లి, తూర్పుగోదావరి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వరకు విస్తరించి ఉంది.

హామీలిచ్చి చేతులెత్తేసిన అయ్యన్న..

40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన టీడీపీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, అటవీశాఖ మంత్రిగా పనిచేసి ఈ రోడ్డు నిర్మించలేకపోయారు. ఈ రోడ్డు నిర్మిస్తానని పలుమార్లు హామీలివ్వడం తప్ప పనులు చేయలేకపోయారు. మాజీ ఎమ్మెల్యేలు ముత్యాలపాప, గొట్టేటి దేముడు, ఎంఈవీ సత్యనారాయణ సైతం చేతులెత్తేశారు.

పట్టువదలని విక్రమార్కుడిలా ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే గణేష్ పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించారు.

మూడేళ్ల నుంచి రోడ్డు విస్తరణకు కావాల్సిన అన్ని చర్యలు చకచకా తీసుకున్నారు. ఆరిల్లోవలో 30 అడుగుల రోడ్డు విస్తరణ కోసం 2022లో అటవీశాఖకు పాకలపాడు రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 203లో 5.20 ఎకరాల భూమి బదలాయించారు. రోడ్డు విస్తరణ సమయంలో రిజర్వు ఫారెస్టులో విలువైన టేకు చెట్లతోపాటు ఇతర చెట్లకు నష్టపరిహారంగా ఈనెల 27న ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.45,31,900 జమ చేయించారు.

సీఎంకు రుణపడి ఉంటాం



మూడు నెలల క్రితం నర్సీపట్నం బహిరంగ సభలో సీఎం జగన్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లా. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో మరోమారు సీఎంను కలిశాను. దాంతో రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ, అటవీ శాఖ రాష్ట్ర ముఖ్యకార్యదర్శులతో కలిసి అన్ని అనుమతులు పొందాం. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వంలో చేయలేని ఈ పనిని వైఎస్సార్‌సీపీ పాలనలో చేయడం ఆనందంగా ఉంది. సీఎంకు రుణపడి ఉంటాం.

– పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఎం. కోడూరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమవుతున్నాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన ఎం. కోడూరులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా 4,850 మందికి రూ.11,94,16,081 లబ్ధి చేకూరిందన్నారు. 199 మందికి రూ. 3.58 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణ వ్యయం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.70 లక్షలతో ఇంటింటికీ త్వరలో కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎం. కోడూరు ప్రధాన రహదారి నుంచి ఎస్టీ కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ పరిధిలోని అత్యవసర పనులు కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఎంపీడీవో మీనాకుమారి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, హైస్కూలు కమిటీ చైర్మన్ కోన అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, మండల సచివాలయాల కన్వీనరు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు బోయిలకింతాడలో ‘గడప గడపకు’

దేవరాపల్లి: బోయిలకింతాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం 7 గంటలకు నిర్వహిస్తారని సర్పంచ్ బూరె బాబూరావు తెలిపారు. ఇందులో భాగంగా నూతన గ్రామ సచివాలయం సముదాయ భవనాలను ప్రారంభిస్తారన్నారు. గవరవరం నుంచి కాశీపురం వరకు రూ. 20 కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ పాల్గొంటారన్నారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’ విజయవంతం

- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమం, అభివృద్ధిపై టీడీపీ మహిళల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. నియోజకవర్గంలోని 74 గ్రామ సచివాలయాల్లో 234 మంది కన్వీనర్లు, 4 వేల మంది గృహసారథులు మొత్తం 80 వేల కుటుంబాలను కలిశారన్నారు. ప్రభుత్వానికి వీరంతా మద్దతు తెలిపారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను సీఎం జగన్ తీసుకువచ్చి ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారన్నారు. దాంతో మరో 30 ఏళ్లు సీఎంగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు ఇదే ఉత్సాహంతో పని చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, మండలాధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, మండల సచివాలయ కన్వీనర్లు శానపతి వెంకటరత్నం, ఫాణి శాంతరామ్, చిటికెల వెంకటరమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం...

గొలుగొండ మండలం ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేను జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జక్కు అప్పలస్వామినాయుడు దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ పక్కా ఇల్లు అందిస్తాం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసే కాలువను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతోపాటు పక్కా ఇళ్లు అందిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా లోపూడి గ్రామ సచివాలయం పరిధిలోని బంగారుమెట్ట, ఎల్.బి. పురం గ్రామాల్లో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పలువురు మహిళలు ధర్మశ్రీ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గత టీడీపీ హయాంలో ఇంటి పునాదులు తీసిన తర్వాత రూపాయి మాత్రమే తమ బ్యాంక్ ఖాతాలో వేసి మోసం చేశారని వాపోయారు. దీనికి ఆయన స్పందించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉంటే చాలని ఇళ్లు అందేలా చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయమై వెంటనే చర్యలు చేపట్టాలని తన వెంట వచ్చిన అధికారులను ఆదేశించారు. ఆంజనేయస్వామి గుడికి ఆవతల పక్కన నివాసితులకు కుళాయి వేయలేదని వాపోయారు. వెంటనే స్పందించి ఇరిగేషన్ కాలువ పక్క నుంచి కాలువ తవ్వి కుళాయిలు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఎంపీడీవోలను ఆదేశించారు. ఎల్.బి. పురంలో యాదవులకు చెందిన కమ్యూనిటీ హాలును అభివృద్ధి చేస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీలు దొండా లలితానారాయణమూర్తి, గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు దేవర అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సాయం రమేష్, సర్పంచ్‌లు తమరాన శ్రీను, మేరుగు కుమారి బాబూరావు, సచివాలయ కన్వీనర్లు యెనుముల వాసు, తమరాన రమణ, రాణం సోమునాయుడు, నాయకులు తమరాన కలమనాయుడు, దొండా కుమార్, మోహన్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

నాతవరం: స్పందన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయడమే మన బాధ్యత అని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే చేసిన భూములకు సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వీఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాల న్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల సత్తా



రాజ్యలక్ష్మి



రేవతి

మాకవరపాలెం: ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థిని బి.రాజ్యలక్ష్మి 980 మార్కులు సాధించి మండలానికి టాపర్‌గా నిలిచింది. రేవతి 966 మార్కులు సాధించి ద్వితీయ, 936 మార్కులతో లోహిత తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని పాఠశాల ఇన్‌చార్జి ఎస్‌వో సునీత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్ ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు

రావికమతం/మాడుగుల: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు కొత్తకోట, మాడుగుల జూనియర్ కళాశాలల్లో సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాళ్లు సాయికుమార్, శిరీషారాణి శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు.

కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

- సోమవారం నుంచి సర్వే, మార్కింగ్



సమీక్షిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

రావికమతం: కొత్తకోట మెయిన్ రోడ్డులో ఇకపై ట్రాఫిక్ ఇక్కట్లు తొలగనున్నాయి. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభానికి అన్ని శాఖల అధికారులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులతో శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ముందుగా రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలం నిర్ధారణకు సోమవారం నుంచి సర్వే చేసి వారం రోజుల్లో మార్కింగ్ చేస్తామని సర్వేయర్ సత్యనారాయణ తెలిపారు. ఇంటింటికీ మార్కింగ్ చేసిన తర్వాత నోటీసులు పంపాలని తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. ఆక్రమణదారులందరూ సహకరించి స్వచ్ఛందంగా తొలగిస్తే పనులు వేగవంతంగా పూర్తవుతాయన్నారు. కొత్తకోటలో 1,300 మీటర్ల మేర సీసీరోడ్డు వేస్తామని ఆర్అండ్‌బీ జేఈ జయరాజ్ తెలిపారు. పదేళ్ల క్రితం నర్సీపట్నం నుంచి చోడవరం వరకు 50 అడుగుల మేర చేపట్టిన విస్తరణ పనులు కొత్తకోటలో ఆగిపోయాయి. దాంతో ఇప్పటికీ సింగిల్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో ఎట్టకేలకు ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే వడ్డాది నుంచి వెలంకాయపాలెం వరకు రూ.104 కోట్ల ఎన్‌డీబీ నిధులతో ప్రస్తుతం చేపట్టే విస్తరణ పనులు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉంది. ఎస్ఐ విభీషణరావు, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందాల దేవ, ఎంపీటీసీ పూడి దేవ, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, నాయకులు గున్నాజిరావు, కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వేసవి మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ మహమ్మద్

రావికమతం: కొత్తకోట గ్రాండ్ బాయ్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వేసవి మెగా క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, మాజీ సర్పంచ్ కోట నీలవేణి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు చెడుమార్గాలను ఎంచుకోకుండా ఉండేందుకు ఇటువంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఏటా ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్న గ్రాండ్ బాయ్స్‌ను అభినందించారు. ఈ పోటీల్లో 40 జట్లు తలపడనున్నాయి. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేల చొప్పున బహుమతులతోపాటు ట్రోఫీ, సర్టిఫికెట్ అందించనున్నారు. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.2 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు, బౌలర్‌కు రూ.1,500, బెస్ట్ కెప్టెన్‌కు రూ.1,500 చొప్పున ఇవ్వనున్నట్టు కమిటీ సభ్యులు బాబి, దొర, రవి, గోవింద తెలిపారు. హైస్కూల్ కమిటీ చైర్మన్ అడ్డూరి నానాజి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



పరీక్షకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

మాకవరపాలెం: నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఉన్నత పాఠశాల కేంద్రంలో మాకవరపాలెం, కోటవుటర్ల మండలాల విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తం 243 మందిని ఈ కేంద్రానికి కేటాయించగా 229 మంది హాజరయ్యారని హెచ్ఎం అచ్యుతరామయ్య తెలిపారు.

కె.కోటపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నవోదయ పరీక్షకు 240 మందికిగాను 230 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో మధుమూర్తి తెలిపారు.

చోడవరం రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 265 మంది నవోదయ పరీక్ష రాశారు. 23 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 245 మంది పరీక్ష రాశారని, 16 మంది హాజరు కాలేదు. సీఐ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

విద్యతోనే అసమానతలు దూరం



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ


మాకవరపాలెం: చదువు సంపద ద్వారా సమాజంలో అసమానతలను రూపుమాపవచ్చని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. బూరుగుపాలెం ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోడు భూములను సాగుచేస్తున్న వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ ప్రసాదరావు, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రహమాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్.కొత్తపట్నంలో..

రావికమతం: జెడ్.కొత్తపట్నంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేశ్వరరావు పాల్గొని దళితుల హక్కులు, చట్టాలు, అంటరానితనం, బాలకార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పౌరులకు హక్కుల సాధనకు సర్పంచ్ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశారు. సారా, గంజాయి సరఫరా నిర్మూలనకు కృషి చేయాలని తీర్మానించారు. గ్రామ ముఖ్య నాయకుడు వితంశెట్టి సురేష్, చినబ్బాయి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి

- రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వెంకన్నపాలెంలో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యవతి, విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమంతోపాటు ఎంతో అభివృద్ధి జరిగిందని అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 60 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. చోడవరం శివాలయం వద్ద రూ. 10 లక్షలతో సీసీరోడ్డు, అంబేరుపురంలో రూ. 10 లక్షలతో మంచినీటి ట్యాంక్, గోవాడలో మేస్త్రి యూనియన్‌కు కమ్యూనిటీ హాలు రూ. 10 లక్షలు, అడ్డూరులో కమ్యూనిటీ హాలుకు రూ. 10 లక్షలు, వెంకన్నపాలెంలో నాయిబ్రాహ్మణ సంఘానికి కమ్యూనిటీ హాలు రూ. 10 లక్షలు, గంధవరంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 10 లక్షలు కేటాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చూసి టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. డాక్టర్ బి. విష్ణుమూర్తి, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు వల్లా నర్సింగరావు, మొల్లి ఈశ్వరరావు, కార్లె ఈశ్వరమ్మ, బండి నూకాలమ్మ, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య పాల్గొన్నారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు ఇస్తున్న ఎంఈవో అమృత్‌కుమార్

నాతవరం: తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే విద్యార్థులు చదివితే ఆశించిన ఫలితాలు వస్తాయని ఎంఈవో తాడి అమృత్ కుమార్ తెలిపారు. శనివారం సరుగుడు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు.

నర్సీపట్నం: వేసవి సెలవుల్లో పిల్లలు చదువుపై పట్టు కోల్పోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు తెలిపారు. పెదబొడ్డేపల్లి గురుకులంలో పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.

కె.కోటపాడు: ఎ.కోడూరు హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రోగ్రెస్ రిపోర్టులను హెచ్ఎం అనురాధ విద్యార్థులకు అందజేశారు.